క్లుప్తంగా

## ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



ఒంగోలు సబర్బన్: ప్రకృతి వ్యవసాయం పర్యావరణానికి మేలు చేస్తుందని రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి.విజయ్‌కుమార్ అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావుతో పాటు సౌత్ కోస్టల్ జిల్లాల్లోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాల ప్రాజెక్ట్ మేనేజర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి జిల్లాలోని పలు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఒంగోలు సమీపంలోని కొప్పోలులో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలాల సందర్శనలో భాగంగా కొప్పోలు గ్రామానికి చెందిన సుభాషిణి, ముప్పా మాధురి మెట్ట వరిలో సాగుచేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ టీఎల్ గోపీచంద్, సౌత్ కోస్టల్ జిల్లాల ప్రాజెక్ట్ మేనేజర్లు, ప్రకృతి వ్యవసాయ రాష్ట్రస్థాయి సిబ్బంది, ఒంగోలు, కొత్తపట్నం వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన మద్దిపాడు ఎస్‌ఐ



మద్దిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌ఐగా వెంకట సైదులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పరిస్థితులపై అవగాహన పెంచుకుని శాంతి భద్రతలపై దృష్టి పెడతానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాగా, ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన శివరామయ్యను అకస్మాత్తుగా వీఆర్‌కు పంపించడంపై మండలంలో చర్చ నడుస్తోంది. రెండు రోజుల క్రితం పట్టుకున్న గ్రావెల్ టిప్పర్ల విషయంలో ఆయనను వీఆర్‌కు పంపినట్లు పలువురు భావిస్తున్నారు.

## నీటి గుంతలో పడిన గ్రానైట్ లారీ

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): గ్రానైట్ వైట్ స్టోన్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న నీటి గుంతలో పడిన సంఘటన సంతనూతలపాడు మండలం ఎండ్లూరుడొంక సమీపంలోని వంతెన వద్ద గురువారం జరిగింది. తెల్లవారుజామున బద్వేల్ నుంచి గుండ్లాపల్లికి గ్రానైట్ వైట్ స్టోన్ లోడుతో భారీ లారీ వెళ్తోంది. ముందువైపు వెళ్తున్న 108 వాహనాన్ని ఢీకొట్టి అదుపుతప్పి బోల్తాకొట్టినట్లు స్థానిక ఎస్‌ఐ అజయ్‌బాబు తెలిపారు. గురువారం సాయంత్రం క్రేన్ ద్వారా లారీని బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. అయితే, వంతెన దెబ్బతింది.

## నేడు కొప్పోలు రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: ఒంగోలు రూరల్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ల ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఒంగోలు రూరల్ సెక్షన్ ఏఈఈ ఎం.రవిప్రకాష్ తెలిపారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో విద్యుత్ సబ్ స్టేషన్లతో పాటు విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా కొప్పోలు రోడ్డులోని పలు ప్రాంతాలతోపాటు ఇందిరా కాలనీ ఒకటి నుంచి తొమ్మిదో లైన్ వరకు, జయప్రకాష్ నగర్, డ్రీమ్స్ స్కూల్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. అందుకుగాను విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## గిడుగు రామ్మూర్తి చిత్రపటం ఆవిష్కరణ

కొత్తపట్నం: వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిర్మస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న చెక్కా కోటేశ్వరరావు తెలుగు పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటాన్ని గీసి పాఠశాలకు బహూకరించారు. నీతి పద్యాలను ముద్రించి 1000 కాపీలను విద్యార్థులకు అందించామన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా చూడాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో సురేష్‌బాబు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. పంచాయతీరాజ్ ఏఈ వీరాంజనేయులు, డిప్యూటీ ఎంపీడీవో రమణమ్మ, వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బొజ్జ గణపయ్య.. ఆశీర్వదించయ్యా!



గొడుగుపాలెంలో దర్శనమిస్తున్న గణపతి..



సుజాతనగర్ 8వ లైన్‌లో కొబ్బరికాయల గణపతి



దక్షిణం బజార్‌లో 6116 శంఖులతో ..



ఒంగోలు కొత్త మామిడిపాలెంలో..

ఒంగోలు మెట్రో:

సర్వ శుభాల్ని కలిగించేవాడు, సకల విఘ్నాలను తొలగించేవాడు. దేవగణాలకు గురువు, విఘ్నాధిపతి.. భక్తుల కొంగుబంగారమైన వరసిద్ధి వినాయకుడి పండుగ వినాయక చవితిని బుధ, గురవారాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఒంగోలు నగరంలో వీధివీధినా వినాయక విగ్రహాలు వెలిశాయి. గణపతి మండపాలకు వివిధ రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా భారీ గణపతులతో భూలోకమే కైలాసంగా మండపాలలో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తి గీతాలతో డీజే సౌండ్‌లతో ఆధ్యాత్మిక పండగ సందడి నెలకొంది. ఉదయం భక్తులు వారి నివాస గృహాలలో వినాయక వ్రతాలను ఆచరించి మండపాలలో కొలువై ఉన్న గణపతులను దర్శించుకుని దంపతులు కుటుంబ సమేతంగా వినాయక స్వామి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని వివిధ మండపంలో శివుని రూపంగా, మరొక మండపంలో ఆరు చేతులతో, సింహాసన రూఢుడై, గజవాహనంపై, నంది, గరుడ వాహనం, ముత్యాలతో, శంఖువులతో ఇలా రకరకాల భంగిమలతో భక్తులను అనుగ్రహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద మండపంలో అద్భుతంగా హిమగిరిల మధ్య వినాయకుడు, దక్షిణం బజారులోని మండపంలో శ్వేతవర్ణ శంఖాలతో ఏర్పాటు, ఈమనిపాలెం మండపంలోని మహాగణపతి మూర్తిని చూసిన భక్తులు పరవశించిపోయారు. భక్తుల రాకతో గణపతి మండపాలు పండగ సందడి నెలకొంది.



పూజల్లో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, బ్రహ్మానందరెడ్డి, రవిబాబు



చీమకుర్తి హరిహరక్షేత్రంలో వినాయకుడికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా



చీమకుర్తి రెడ్డిబజార్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి

### వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

ఒంగోలు సిటీ: వినాయకచవితి పండుగను ఒంగోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినాయకచవితి పండుగను ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొని వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, మహిళా నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో వినాయకచవితి వేడుకలు

చీమకుర్తి: వినాయకచవితి వేడుకలను చీమకుర్తి పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చీమకుర్తి హరిహరక్షేత్రంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఆలయ అర్చకులతో కలిసి పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. చీమకుర్తి రెడ్డి బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, స్థానిక భక్తులు పూజలు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తిగీతాలతో ఉత్సాహంగా వేడుకలు నిర్వహిస్తున్నారు.

## గొర్రెల పెంపకందారుల సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా గంటా

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా గంటా శ్రీరాం, కార్యదర్శిగా పూసపాటి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర 7వ మహాసభలను ఒంగోలు నగరంలోని ఎల్బీజీ భవనంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకోగా, ఉపాధ్యక్షునిగా కిలారి పెద్దబ్బాయి (ప్రకాశం జిల్లా), సహాయ కార్యదర్శులుగా ఏవీ కృష్ణారావు (ఏలూరు), తోట తిరుపతిరావు (ప్రకాశం), పాపిన సాంబమూర్తి (శ్రీకాకుళం), దాసరి జనార్దన్ (తిరుపతి), గోకాడ దేవుడునాయుడు (అనకాపల్లి), కురవ రాయుడు (కర్నూలు), మరికొందరు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గొర్రెల కాపరుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, ప్రతి గ్రామంలో మేత భూములు ఏర్పాటు చేయాలని, నీటి వసతి కల్పించి వలసలను నివారించాలని, ప్రైవేటు మార్కెట్ దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వమే మార్కెట్‌ను నిర్వహించాలని, గొర్రెల బీమా పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని, 50 ఏళ్లు దాటిన గొర్రెల పెంపకందారులకు పెన్షన్ ఇవ్వాలని తీర్మానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పశువైద్యుల పోస్టులు భర్తీ చేయాలని, ఆర్బీకేలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## గ్యాస్ లీకేజీ ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ఒంగోలు టౌన్: ఈనెల 14వ తేదీన సత్యనారాయణ పురంలోని జర్నలిస్టు మేకపాటి మాల్యాద్రి ఇంటిలో జరిగిన గ్యాస్ లీకేజీ ప్రమాదంలో గాయపడిన ఆయన కోడలు శిరీష (21) మృతి చెందారు. ప్రమాదం జరిగిన తరువాత ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడలోని ఒక కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో 80 శాతం శరీరం కాలిపోయిన శిరీష చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మరణించింది. ఈ ప్రమాదంలో మాల్యాద్రికి కూడా గాయాలయ్యాయి. అయన చికిత్స అనంతరం కోలుకున్నారు. శిరీష అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## దిగుమతి సుంకాలు రద్దు సరికాదు



మాట్లాడుతున్న చుండూరి రంగారావు

ఒంగోలు టౌన్: పత్తి పంటపై దిగుమతి సుంకాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని.. ఇది పత్తి రైతుల ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీస్తుందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలోని మాదాల నారాయణ స్వామి భవనంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి దిగుమతి సుంకాల రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30, 31 తేదీల్లో దర్శి నియోజకవర్గాలలోని తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో ప్రచారం చేయాలని, సెప్టెంబర్ 1వ తేదిన మార్కాపురం ఆర్డీవో కార్యలయం ఎదుట ధర్నా చేయాలని, 2వ తేదిన ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో రైతు నాయకులు వడ్డే హనుమారెడ్డి, లలిత కుమారి, దుద్దూరి జయంతిబాబు పాల్గొన్నారు.

## మరో పోరాటానికి సిద్ధం కావాలి



సభలో మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎస్.జ్యోతిబసు మండిపడ్డారు. గురువారం చీమకుర్తిలో నిర్వహించిన సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా 11వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని జూలై 12 నుంచి 21వ తేదీ వరకు పోరాటాలు చేస్తే.. మున్సిపల్ వర్కర్ల గురించి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమ్మె కాలం జీతాలకు సంబంధించి వెంటనే జీవోలివ్వాలని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు అర్హత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా వారిపై పనిఒత్తిడి పెంచుతున్నారని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే సామ్రాజ్యం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా వినాయక నిమజ్జనాలు

కొత్తపట్నం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే నిమజ్జనాలను పకడ్బందీగా నిర్వహించాలని ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. కొత్తపట్నం బీచ్‌లో వినాయక విగ్రహాలు నిమజ్జనాలు ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. విగ్రహాలను మాత్రమే బీచ్ ప్రాంతానికి వెళ్లేలా చేయాలని, మిగతా వాహనాలు రాముడి ఆలయం ఎదురుగా నిలుపదల చేయాలని ఆదేశించారు. బీచ్‌లో నిమజ్జనం చేసిన వెంటనే బృందావనం వైపు నుంచి కొత్తపట్నం శివాలయం రోడ్డువైపునకు మళ్లించాలన్నారు. ఐదో రోజు ఆదివారం ఎక్కువ వినాయక విగ్రహాలు వస్తాయని చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. భక్తులు సముద్రం లోతుకు వెళ్లనీయకుండా మెరైన్ పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను, గస్తీ తిరిగే ఒక బోటును సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వేముల సుధాకర్‌బాబు, మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌ఐవీ బాధితులపై చిన్నచూపు తగదు



అవగాహన కల్పిస్తున్న పీరుబాషా

ఒంగోలు టౌన్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల చిన్నచూపు చూడవద్దని.. సమాజంలో అందరిలాగే ఆదరించాలని గ్రో ఆర్గనైజేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ పీరు బాషా చెప్పారు. ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా గురువారం నగరంలోని బాలాజీ నగర్ మున్సిపల్ స్కూల్ ఆవరణలో హెచ్‌ఐవీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ గురించి ఏమైనా సందేహాలు ఉంటే ఏపీ సాక్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 ఫోన్ చేయాలని సూచించారు. హెచ్‌ఐవి , ఎయిడ్స్ వ్యాధి వ్యాపించకుండా తీసుకోవలసిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మి ప్రసన్న, సిబ్బంది శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు నాగమణి, రమాదేవి, గ్రో అప్ సిబ్బంది ఎం.వెంకటరావు, బ్రాహ్మణ, అరుణ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్తాం



ఉప్పుగుండూరు సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తూ ప్రజల మీద మోయలేని భారం వేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు హెచ్చరించారు. పార్టీ నగర కమిటి ఆధ్వర్యంలో 33,37 డివిజన్ల పరిధిలో వున్న భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు బషీర్‌బాగ్‌లో ఏ విధంగా ఉద్యమం జరిగిందో నేడు అలాంటి ఉద్యమాలు చేసి గుణపాఠం చెప్తామన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నారని, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నగరంలోని సత్యనారాయణ పురం, 60 అడుగుల రోడ్డు, శ్రీనగర్ కాలనీల్లో బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరులకు నివాళులు అర్పించారు.

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): విద్యుత్ ఉద్యమం 25వ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంతనూతలపాడులోని సుందరయ్యభవన్‌లో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ ఉద్యమం దినోత్సవం సందర్భంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు జె.జయంతిబాబు, శ్రీకాంత్, కాకాని హరిప్రసాదు, రావెళ్ల వెంకట్రావు నాయకులు పాల్గొన్నారు.